# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 17 ఏప్రిల్ 2024 SANGAREDDY


## బీఆర్‌ఎస్‌కు ఢోకా లేదు: ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, ఏప్రిల్ 16: నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడినా పార్టీకి ఢోకాలేదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వెల్లడించారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొందరు నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడినా పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. అవినీతి ఆరోపణలతో బయటకురాని వ్యక్తులే బీఆర్‌ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లోకి వెళ్లారని ఎద్దేవా చేశారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్‌లో చేరారన్నారు. కాంగ్రెస్‌లోకి కేవలం కొందరు నాయకులు మాత్రమే వెళ్లారని, కార్యకర్తలు వెళ్లలేదని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులు కేసీఆర్ వెంటే ఉంటారని, బీఆర్‌ఎస్ కోసం పని చేసి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి కృషి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, సత్యంగౌడ్, సూరారం నర్సింహులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

## కేసీఆర్ వాహనంపై పూలవర్షం

గజ్వేల్, ఏప్రిల్ 16: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం నుంచి సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ బహిరంగ సభకు మంగళవారం మధ్యాహ్నం బయలుదేరారు. అదే సమయంలో కేసీఆర్ వాహనంపై అక్కడే ఉన్న ఎర్రవల్లి యువకులు గులాబీ పూల వర్షం కురిపించారు. జై కేసీఆర్... జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. యువకులకు అభివాదం చేస్తూ కేసీఆర్ బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ముందుకు కదిలారు.


ఎర్రవల్లిలో కేసీఆర్ వాహనంపై పూలవర్షం కురిపిస్తున్న యువకులు


సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, చిత్రంలో హరీశ్‌రావు, మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, అనిల్ కుమార్, వేదికపై ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు

# మెతుకుసీమ దీవెనలతో తెలంగాణ తెచ్చిన

- మళ్లీ ఈ గడ్డ ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం..
- సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలను కాంగ్రెస్ పండబెట్టింది..
- రైతులు, అన్నివర్గాలను కంటికి రెప్పలా కాపాడుతా..
- ప్రజలు బాగా ఆలోచించి ఓటేయాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తేనే కాంగ్రెస్ హామీల అమలు
- సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- సభ గ్రాండ్ సక్సెస్..
- పోటెత్తిన జనం.. గులాబీమయం

సిద్దిపేట, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాజకీయంగా ఎదగడానికి, తెలంగాణ సాధించడానికి పోరాట పటిమ అందించింది, పెంచింది మెతుకు సీమ అని బీఆర్‌ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లాలోని అందోల్ నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారి పక్కన తార్‌దాన్‌పల్లి వద్ద మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల బీఆర్‌ఎస్ ప్రజాఆశీర్వాద సభ జరగింది. సభకు రెండు నియోజకవర్గాల పరిధిలోని అందోల్, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాల నుంచి ఆశేషంగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ...మీరు ఇచ్చిన బలమే ఢిల్లీతో కొట్లాడి ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించానన్నారు. మీ దీవెన, అండదండలు, ఆశీర్వాదం లేకపోతే ఈ మెతుకు గడ్డ నీరు, రక్తం తన శరీరంలో లేకపోతే తనకు ఈస్థాయి వచ్చేది కాదన్నారు. మొన్న జరిగినటువంటి ఎన్నికల్లో కూడా ఏ జిల్లాలో రానటువంటి భారీ మెజార్టీనిచ్చారన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, ఇతర నాయకుల నేతృత్వంలో ఏడుగురు ఎమ్మెల్యేలను గెలిపించిన మెతుకు సీమ గడ్డకు రెండు చేతులు జోడించి నమస్కారం చేస్తున్నానన్నారు. ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేనని కేసీఆర్ చెప్పారు. ఇయ్యాళ కొంతమంది ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు పార్లమెంట్ ఓట్లు ఎందుకు, సీట్లు ఎందుకు అని మాట్లాడుతున్నారన్నారు. ఇప్పుడే కావాలి బీఆర్‌ఎస్‌కు పార్లమెంట్‌లో ఓట్లు సీట్లు అని చెప్పారు. ఆనాడు మీరు ఆశీర్వదించి పంపకపోతే, కరీంనగర్‌కు వెళ్లి పార్లమెంట్‌కు పోటీ చేసి గెలవకపోతే తెలంగాణ బిడ్డగా గర్జించకపోతే మనకు తెలంగాణ రాష్ట్రం వచ్చేదా..? అని అన్నారు. ఈరోజు కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశలు, హక్కులు నేరవేర్చాలంటే, తప్పకుండా బీఆర్‌ఎస్ బిడ్డలు పార్లమెంట్‌లో ఉంటేనే మన హక్కులు నెరవేరుతాయన్నారు.


సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్, హరీశ్‌రావుతో మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, అనిల్ కుమార్

### సంగమేశ్వర, బసవేశ్వర ఎందుకు ఆగింది..

ఒకనాడు సింగూరు ప్రాజెక్టును ఎండబెట్టింది ఇదే లిల్లిపుట్టుగాళ్లు కదా అని కేసీఆర్ అన్నారు. మనకి నీళ్లు ఇయ్యలేదు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకుపోయి ఇచ్చారని చెప్పారు. సాగు నీరు లేక ఏడ్చినం, ఎంతో భాదపడ్డామన్నారు. సాగునీళ్ల కోసం నిజామాబాద్, సంగారెడ్డిలో ధర్నాలు చేశారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ఇదే హరీశ్‌రావు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి కాల్వలు తవ్విస్తే ఆందోల్‌కు నీళ్లు వచ్చి పంటలు పండాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆనాడు నీళ్లు వచ్చినాయా..? అని ప్రశ్నించారు. ఇయ్యాళ ఈ లిల్లి పట్టుగాళ్లు ఏం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సంగమేశ్వర, బసవేశ్వర రెండు లిఫ్టులు పెట్టుకున్నామన్నారు. కాళేశ్వరం నీళ్లతోని సింగూరుకు లింకు పెట్టుకున్నామన్నారు. మల్లన్నసాగర్‌తో నిజాంసాగర్, మెదక్ జిల్లాకు కలుపుకున్నామన్నారు. ఫలితంగా సంగమేశ్వర, బసవేశ్వరతో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాలకు వచ్చే విధంగా ప్రాజెక్టును రూపకల్పన చేసుకొని పనులు ప్రారంభించామన్నారు. రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందే విధంగా ఈ ప్రాజెక్టు చేసుకున్నామన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ ప్రాజెక్టును ఆపారని మండిపడ్డారు. ఎందుకు కోల్డ్ స్టోరేజీల పెట్టారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు బాగా ఆలోచన చేయాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కోరారు.

### ఇద్దరూ.. చదువుకున్న వాళ్లు

బీఆర్‌ఎస్ తరపున పార్లమెంట్‌కు నిలబడిన వాళ్లు చదువుకున్న వాళ్లని, మెదక్‌లో వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్‌లో అనిల్‌కుమార్ గెలిస్తే ఓల్పట, దాపట కోడెళ్లలాగ ఉంటారని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. వెంకట్రామిరెడ్డి ఐఏఎస్, గాలి అనిల్‌కుమార్ తెలంగాణ ఉద్యమకారుడని, ఉద్యమంలో పోరాటం చేసిన బలహీన వర్గాలకు చెందిన బిడ్డ అని చెప్పారు. వీరిద్దరినీ గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆగం ఆగం అయితే అడివి అడివి అయితామన్నారు. ఆనాడు చెప్పిన మీ బిడ్డగా తెలంగాణ తెస్తా అని, మళ్లీ చెబుతున్న మీ ఆశీర్వాదంతో గ్యారంటీగా రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొస్తానన్నారు. రైతాంగం, అన్ని వర్గాల ప్రజలను కాపాడుతా అని ప్రజల హర్షధ్వానాల మధ్య కేసీఆర్ చెప్పారు. సభకు తరలివచ్చిన ప్రతిఒక్కరికీ కేసీఆర్ ధన్యవాదాలు తెలియజేశారు.

## హామీలు అమలుచేయని కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

### మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

అందోల్, ఏప్రిల్ 16: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను ఎంపీ ఎన్నికల్లో బొందపెట్టాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా రైతుబంధు, రూ.2 లక్షల పంట రుణమాఫీ, కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఆడ బిడ్డలకు ఇస్తామన్న రూ.2500 ఏమయ్యాయని గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలన్నారు. వంద రోజుల్లో అన్ని హామీలు అమలుచేస్తామని బాండ్లు రాసిచ్చిన ప్రభుత్వం ఏమైందన్నారు. కాంగ్రెస్ ఇచ్చినవన్నీ అమలుకాని హామీలని, రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో మాట్లాడిన మాటలను సభలో స్క్రీన్లపై ప్రదర్శించడంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చిందన్నారు. మరోసారి కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రశ్నించే గొంతుకలు మన బీఆర్‌ఎస్ తరపున పార్లమెంట్‌లో ఉండాలన్నారు. విద్యావంతుడు, మాజీ ఐఏఎస్ అధికారి వెంకట్రామిరెడ్డిని, మెదక్ నుంచి ఉద్యమకారుడు, ప్రజాసేవపై అంకితభావం కలిగిన గాలి అనిల్‌కుమార్‌ను జహీరాబాద్ ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్ పదేండ్ల కాలంలో తెలంగాణను అన్నిరంగాల్లో ఎంతో అభివృద్ధి చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను, పరిపాలను గాలికొదిలేసిందన్నారు. పొద్దున లేసింది మొదలు ఇంటి ఎదుట ప్రత్యక్షమై మా పార్టీలో చేరండి అంటూ పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహిస్తున్నారని, ఇదీ ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా అంటూ ప్రశ్నించారు. ఇలాంటి ఝూఠాకోర్ పార్టీని నమ్మితే తెలంగాణను ఎడారిగా మారుస్తుందన్నారు. రాష్ట్రం–లోని 42 లక్షల 80వేల మంది పెన్షన్‌దారులను బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసిందని, ఈ ప్రభుత్వంపై చీటింగ్ కేసు పెట్టొద్దా అని అన్నారు. బాండ్ పేపర్ రాసిచ్చి ప్రజల గుండెల మీద తన్నారని...ప్రజలను, రైతులను, కార్మికులను, యువతను, మహిళలను మోసం చేసిన పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెటాల్నా వద్దా అంటూ ప్రజలను హరీశ్‌రావు ప్రశ్నించడంతో బొందపెట్టాలి అంటూ చపట్లతో సభను మార్మోగించారు. బీజేపీ గురించి చెప్పేది ఏమీ లేదని, ఆ పార్టీకి ఓటేస్తే వృథాగా పోవడం తప్పా ఎలాంటి ఉపయోగం లేదన్నారు. మతం పేరుతో బీజేపీ, పార్టీ ఫిరాయింపులతో కాంగ్రెస్ కాలం వెల్లదీస్తూ ప్రజా సమస్యలను గాలి కొదిలేశాయని హరీశ్‌రావు విమర్శించారు. ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి కేసీఆర్‌ను మద్దతుగా నిలవాలని హరీశ్‌రావు కోరారు. బీఆర్‌ఎస్ ప్రజలకు అండ అని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన అన్నారు. జహీరాబాద్ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ స్వార్థపరుడని, పార్టీ రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే ఇప్పుడూ బీజేపీ పంచన చేరి వ్యాపారాన్ని కాపాడుకోవడం కోసం మరోసారి పోటీ చేస్తున్న అతడికి తగిన బుద్ధి చెప్పాలని పోచారం అన్నారు. జై తెలంగాణ అనని, అమరులకు నివాళులర్పించని ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ విమర్శించారు.


సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో చింతా ప్రభాకర్, చంటి క్రాంతికిరణ్, మామిండ్ల రాజేందర్


సభకు హాజరైన అశేష జనం

## కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్

చౌటకూర్/పుల్కల్, ఏప్రిల్ 16: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలంలోని సుల్తాన్‌పూర్ శివారులో మంగళవానం నిర్వమించిన ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ అయింది. వేలాదిగా జనం తరలిరావడంతో పరిసరాలు గులాబీమయమయ్యాయి. రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు హోరెత్తించాయి.

### మిన్నంటిన జైకేసీఆర్ నినాదాలు...

సభకు కేసీఆర్ రాగానే జై కేసీఆర్.. జై జై కేసీఆర్ అనే నినాదాలు మిన్నంటాయి. కేసీఆర్ సభాస్థలానికి చేరుకోగానే జహీరాబాద్, మెదక్ ఎంపీ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, వెంకట్రామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగ తం పలికారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైన తీరును సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన స్క్రీన్ ద్వారా ప్రజలకు అర్థమయ్యేలా మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చూపించారు. పోలీసులపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి.

### తరలివచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు...

మాజీమంత్రి హరీశ్‌రావు, మాజీ సభాపతి, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాసరెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల జడ్పీ చైర్పర్సన్లు హేమలతాశేఖర్ గౌడ్, మంజుశ్రీజైపాల్ రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, హన్మంత్ షిండే, పద్మాదేవేందర్ రెడ్డి, రసమయి బాలకిషన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేషన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, దేవీశ్రీ ప్రసాద్, మఠం భిక్షపతి, నరోత్తం, వంటేరు ప్రతాప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఉదయ్‌బాబూమోహన్, సాయికుమార్, భాస్కర్‌రెడ్డి, పట్నం మాణిక్యం, శివకుమార్, దేశ్‌పాండే, బాలయ్య, నరహరరెడ్డి, నారాయణముదిరాజ్, మీనాక్షీసాయికుమార్, సునీతామనోహర్ గౌడ్, శైలజాశివశంకర్, వీరేందర్, ఎంపీటీసీ పట్లోళ్ల మాణిక్‌రెడ్డి, మాణయ్య, శివకుమార్, విజయ్‌కుమార్, లక్ష్మీకాంతరెడ్డి, నర్సింహులు, దర్శన్‌రెడ్డి, మల్లారెడ్డి, పరమేశ్వర్ గౌడ్, మల్లేశం పాల్గొన్నారు.


సభకు తరలివస్తున్న ప్రజానీకం

## బీఆర్‌ఎస్ సమన్వయకర్తల నియామకం

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మెదక్ పార్లమెంట్‌కు సంబంధించి 7 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను మంగళవారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. సంగారెడ్డి నియోజకవర్గానికి టీఎస్ఎంఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మెదక్ నియోజకవర్గానికి డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్‌రావు, గజ్వేల్ నియోజకవర్గానికి సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణశర్మ, సిద్దిపేట నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్‌ను నియమించారు.

### జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7 నియోజకవర్గాలకు సమన్వయకర్తలను కేటీఆర్ నియమించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఆందోల్ నియోజకవర్గానికి డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నారాయణఖేడ్ నియోజకవర్గానికి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, కామారెడ్డి నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి కార్పొరేషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గానికి దఫేదర్ రాజు, జుక్కల్ నియోజకవర్గానికి డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిని నియమించారు.

## సివిల్స్‌లో మెరిసిన అఖిల్

- యూపీఎస్సీ-2023 ఫలితాల్లో 321 ర్యాంకు సాధించిన అఖిల్ యాదవ్
- 2021 సివిల్స్ ఫలితాలలో 566వ ర్యాంకు

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 16: కలెక్టర్ కావాలనే సంకల్పం ముందు పేదరికం ఓడింది. తల్లిదండ్రులు పెద్దగా చదువుకోలేదు. ఆ కుటుంబంలో విద్యావంతులు పెద్దగా లేరు. అయితేనేమీ పేదరికాన్ని సైతం ఎదిరించి ఐఏఎస్ సాధించి సత్తాచాటాడు సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన బుద్ధి అఖిల్ యాదవ్. 2021లో మొదటి ప్రయత్నంలోనే 566 ర్యాంకు సాధించాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా ఓవైపు ఢిల్లీలో ట్రైనీ ఐపీఎస్‌గా విధులు నిర్వర్తిస్తూనే ఐఏఎస్ లక్ష్యంగా శ్రమించాడు. 2023 సెప్టెంబర్‌లో యూపీఎస్సీ మెయిన్స్ పరీక్షలకు హాజరయ్యాడు. 2024 జనవరిలో ఇంటర్వ్యూకు హాజరైన బుద్ధి అఖిల్‌యాదవ్, మంగళవారం వెలువడిన సివిల్స్ ఫలితాల్లో 321వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు.


అఖిల్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

## క్రాంతికిరణ్‌కు కేసీఆర్ అభినందన



అందోల్, ఏప్రిల్ 16: తాడ్డన్‌పల్లి చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సభ ముగిసిన తర్వాత తిరుగుప్రయాణంలో క్రాంతికిరణ్‌కు ఫోన్ చేసిన కేసీఆర్ సభ గ్రాండ్ సక్సెస్ చేశావు క్రాంతి... గుడ్ గోయింగ్ .. ఇలాగే పనిచేయండి.. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల చాలా వ్యతిరేకత ఉంది. మనం నిరంతరం ప్రజల్లో ఉంటూ కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. మీ సూచనలు తప్పకుండా పాటిస్తూ నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై కాంగ్రెస్‌ను, ప్రభుత్వాన్ని నిలదీస్తామని క్రాంతి చెప్పారు.

### అలరించిన గోవిందా.. గోవిందా సాంగ్

పుల్కల్, ఏప్రిల్ 16: సుల్తాన్‌పూర్ ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ, రచయిత దేశపతి శ్రీనివాస్ పాడిన గోవిందా..గోవిందా సాంగ్ అందరినీ అలరించింది.బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు..కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలు చేయకపోవడంతో సాంగ్ రూపంలో ప్రజలకు అర్థయమయ్యేలా ఆయన పాట పడి ఆకట్టుకున్నారు.